**మూడు వారాల కథ...** **రెండవ వారం...**

# ఆడపిల్లలు

## - బమ్మిడి జగదీశ్వరరావు

**"ఈ** ఇంట్లో వాళ్ళ అభిప్రాయాలు గౌరవించనప్పుడు నువ్వు ఈ ఇంట్లో వుండక్కర్లేదు...'' అన్నాడామె మావయ్య.

నవత తీక్షణంగా ఒక చూపు అతని వంక చూసి ఇంట్లోంచి వీధిలోకి నడవబోయింది.

''ఆగు...'' వెర్రికేక వేసింది మా ఆవిడ.

నవత ఆగింది. ఏమిటన్నట్టు చూసింది.

**"ను**వ్వు లోపలికి రా... ఆఖరిసారి చెప్తున్నాను. నువ్వా మహిళా సంఘంలో చేరిన దగ్గర్నుంచే పాడయిపోయావు. మళ్ళీ అక్కడికే వెళ్తే మాత్రం తిరిగి రావద్దు. ఈ ఇంటి గుమ్మం తాకొద్దు...'' మా ఆవిడ హెచ్చరిస్తూనే ఉంది. దాని మాట ఖాతరు చెయ్యకుండా ముందు అడుగేసింది నా కూతురు సారీ నవత. నాకూ కోపమొచ్చింది. ఆగలేక ''నవతా! వెళ్ళు... తిరిగి రాకు... పో... పోయి ఎందులోనన్నా పడిచావు...'' అన్నాను. నా కడుపున పుట్టీ నన్నే ధిక్కరిస్తే భరించలేకున్నాను. సారీ అది నా కడుపున పుట్టలేదు.

''చావడానికే వెళ్తే ఇంట్లోంచి బయటకెందుకు వెళ్ళాలి? నేను నేనుగా బతకడానికి వెళ్తున్నాను... చావను... బతుకుతాను...'' నవత వెంటే ఆమె మాటలూ అదృశ్యమయి పోయాయి.

నాకాక్షణం ఇంట్లోంచి ఘర్షణపడి వెళ్ళిన - పక్కింటి మూర్తి కొడుకైన మధు గుర్తుకొచ్చాడు. అతడు తన కాళ్ళపై తాను నిలబడి అందరి మన్ననల్నీ పొందాడు. నిజమే, వాడు మగాడు.. మగవాడు... ఇది ఆడది... ఆడపిల్ల అంగట్లోకి వెళ్తే అడుగువేస్తే తెలిసొస్తుంది. తెలిశాక తిరిగొస్తుంది - అనుకున్నాను.

అనుకున్నట్టుగాలేదు, వారం రోజులైనా నవత ఇంటికి రాలేదు. రాదు కూడా. సావిత్రి కూతురు గురించి బెంగపడి తిండీ నిద్రా మానుకుంది. వచ్చీ పోయే వాళ్ళ పరామర్శలు ఆరిపోయిన మంటల్ని రాజేశాయి.

ఇంటికి రాలేదని ఆగలేకపోయాం. ఆ మర్నాడే నవత చేరిన మహిళా సంఘం ఆఫీసుకు వెళ్తే అక్కడే ఉంది. నేనూ వాళ్ళమ్మా ''అమ్మా నవతా... మేం ఏం తప్పు చేశామో చెప్పు... మేం తప్పే చేస్తే ఉరిశిక్ష వెయ్యి... లేదంటే నీకు నచ్చిన శిక్ష వెయ్యి...'' అనేసి తప్పు చేసినట్టు తలలు దించుకున్నాం. నాకలా చెయ్యడం ఇష్టంలేదు. సావిత్రిని కాదనలేకపోయాను.

''అవునమ్మా నవతా... లోకం మీద మరెవ్వరూ ఆడపిల్లల్ని కనలేదు. మా పాపం ఎక్కువై మేమేకన్నాం. కన్నోలకు తమ పిల్లలకి పెళ్ళి చేసి రెండక్షింతలు వెయ్యాలని వుండదా? ఇదా మేం చేసిన ఘోరం... నేరం?'' నా భార్య గుండెలు బాదుకుంది.

నవత ఏమీ మాటాడకుండా మర్రోజు రమ్మంది. వెళ్తే సాక్ష్యంగానేమో అందరి సమక్షంలో ఇంటికి రానని చెప్పింది. మా వేధింపులు భరించలేనని చెప్పింది. నా కాళ్ళ మీద నేను బతుకుతానంది. ఆత్మగౌరవం మిగుల్చుకోనివ్వమంది.

**జరిగిన కథ**

**న**వత ఈ కాలం అమ్మాయి. ఆడపిల్లను పెళ్ళి చేసి పంపేస్తే భారం తీరిపోతుందని భావించే తల్లిదండ్రులకు వాళ్ళు చదువుకుంటేనే బతుకు బాగుపడుతుందని చెపుతుంది. ట్యూషన్లు చెప్పి ఫీజులు కట్టుకొంటుంది. కరాటే నేర్చుకుని, అవే క్లాసులు తీసుకోవటం మొదలుపెడుతుంది. మహిళా సంఘంలో చేరి పని చేస్తూ ఉంటుంది. ఆమె తల్లిదండ్రులకు అర్థం కాదు. సంతలో పశువును బేరం చేసే పద్ధతిలో జరిగే పెళ్ళి చూపులు తనకు ఇష్టం లేదని, పైగా కట్నం తీసుకునే వాడిని పెళ్ళాడనని చెప్తుంది.

గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టు నాకు ఆ మాటలన్నీ వెక్కిరింతగా తోచాయి. అవమానంగా కూడా తోచింది. నా వయసుకయినా గౌరవం ఇవ్వకపోవడం నాకు తలకొట్టేసినట్టయింది.

నా కోపాన్ని అణచిపెట్టుకొని ''మీరైనా మా అమ్మాయిని పంపించండమ్మా...'' అని అక్కడున్న ఆడవాళ్ళని కోరాను.

తనేం చిన్నపిల్ల కాదట. ఒకరు చెప్తే చేసే వయసు కాదట. ఆవిడ బతుకు ఆవిణ్ని బతకనివ్వాలట. ఇప్పుడేమీ జరగలేదట. తన ఇష్టాయిష్టాలు తెలుసుకోకుండా బాధించవద్దని మాకు బుద్ధులు చెప్పడమట.. నీతులు బోధించడమట... తను మంచి పని చేస్తోందట. ప్రోత్సాహించాలట... పాలోమంటూ వాళ్ళ వెనుక జెండా పట్టుకు నడవమన్లేదు. నాకు అగ్గి రేగి పోయింది. తిక్కరేగిపోయింది.

దాంతో బూతులందుకున్నాను. అందుకో నా వాళ్ళ బలం, బలగం చూసేకదా ఇలాగ నీలుగుతోందని నాకు బోధపడిపోయింది. మా ఆవిడకి కూడా. ఇద్దరం బజాయించి తిట్టిపోశాం. మా సైన్యం వాళ్ళ ఆఫీసుని కోతులు పడ్డట్టు చేసి వదిలారు. అద్దాలు పగులగొట్టారు.

నవతకేం వెర్రెక్కిందోగాని ఇంత జరిగినాక రాను.. రాలేను అన్చెప్పి పొమ్మంది. ఆ రోజుకి వచ్చేసినా - రోజూ ఇంటికీ ఆ మహిళా సంఘం ఆఫీసుకు తిరుగుతూనే ఉన్నాం. అక్కడ వాళ్ళు ఆడోళ్ళలా లేరు. నరుకోత నాయురాళ్ళలా వున్నారు. అందుకే అన్ని విషయాలూ ఆరా తీశాను. గుండాగిపోయినంత పనయింది.

అవదూ? ఆషామాషీ కాదు.. అది మహిళా సంఘమేగాని... నక్సలైట్లకు అనుబంధ సంఘమని తెలుసుకున్నాను. ఆళ్ళకు యాంటీగా వుండే పోలీసులు మనకు మిత్రులు అని బోధపరచుకున్నాను. అసలా మాటకొస్తే ఆ విషయం రహస్యంగా పోలీసులే చెప్పారు. పోలీసు కంప్లైంటు ఇద్దామని పోబోతే వాళ్ళే బోలెడు కంప్లైంట్లు చేసినారు నేనేదో పోలీసాఫీసరు అయినట్టు...

అప్పటికే నేనూ మా ఆవిడా మా పుత్రరత్నాలూ బామ్మర్దీ అంతా కలిసి 'వీళ్ళు వేశ్యలనీ', 'దుబాయికి అమ్మాయిల్ని అమ్ముతారనీ' మా అమ్మాయిని కూడా ఎత్తుకు పోయారనీ - నిజంగానే మా అమ్మాయి వాళ్ళ వలలో పడిపోయిందనీ, దానికేమీ తెలీదనీ... మనసులోని బాధ చెపితే తీరిపోతుందని నలుగురికీ చెప్పుకున్నాం..

అయినా మనలోమాట, మా పిల్లకు బుద్ధిలేదు. ఇది మొండికేస్సింది. అందుకే అడ్డ దారిలో కాపుకాసి అట్నుంచటే ఇంటికి ఎత్తుకు పోదామనుకుంటే - అమ్మో కూతురో... తక్కువది కాదు... సాగిలబడి.. ఈడ్చుకొని పోలీసు ఠాణాలో దూరి 'నేను మేజర్ని'

అని మేజర్ కల్నల్ బాబులా చెప్పింది. మేము వేధిస్తున్నామని అన్యాయంగా కంప్లైంటు చేసింది. వాళ్ళ పెద్దన్నయ్య సెక్సువల్ హెరాస్మెంటు చేస్తున్నాడని కూడా కంప్లైంటు ఇచ్చింది. 'లేదు.. లేదు..' అని నా చెంపలు నేనే వాయించుకొని బుద్ధిడి తమ్ముడులా 'మహిళా సంఘమోళ్ళే ఆ అమ్మాయిని కిడ్నాప్ చేశారని' రిపోర్టు ఇచ్చాను.

పోలీసులు అనగా రక్షక భటులు. వాళ్ళు నన్ను



తప్పక రక్షిస్తారు, కోర్టులనగా న్యాయ స్థానములు అక్కడ న్యాయం జరుగుతుంది. నేను మంచివాణ్ని గనుక నాకు మంచే జరుగుతుంది.

నాకు మంచి చేయడానికి శతవిధాలా ప్రయత్నించిన పోలీసులూ, లాయర్లూ న్యాయాధిపతులు వాళ్ళ నోటితో వాళ్ళే చెప్పాలి. కీర్తించడానికి నేను పనికిరాను. తర్వాతయినా వారి నోటితోనే విందాం... రండి... విని పోదురు...

❀❀❀

ఈ కేసులో న్యాయాన్యాయాలు తేల్చేందుకు జడ్జీలున్నారు. వారిముందు నిలబెట్టేందుకు జగత్ జట్టీలు లాంటి పోలీసులు ఉన్నారు. అంచేత అంతకన్నా ముందు పూర్వాపరాలలోకి వెళ్ళి మేం నిర్దోషులం అని నిరూపించుకోవడానికి మాకూ కొన్ని హక్కులున్నాయి.

అందులోని ఒకానొక వాక్ స్వాతంత్ర్యపు హక్కుతోనే మా సోదరులం ఇద్దరం మాట్లాడదలచుకున్నాం. అడ్రసు తెలుసుగా సన్నాఫ్ ధర్మరాజు. అంతటి కడుపున పుట్టి మా సోదరీమణుల వల్ల ఇలా సోది చెప్పుకుంటున్నాం.. ప్చ్...

మా చెల్లెల్ని వేధించిన వారి పేర్లలో మా పేర్లూ ఉన్నాయి. ఆ మచ్చ చెరుపుకునేందుకు మరియు తండ్రికి తగ్గ తనయులమని నిరూపించుకొనుటకు ఇది అపూర్వ అవకాశంగా మేం భావిస్తున్నాం.

మేమూ యవ్వనవంతులమే, మా పెళ్ళి గురించి మా అమ్మానాన్నలు అస్సలు పట్టించుకోలేదు. ఆడవాళ్ళకి వారి వయసుకన్నా యవ్వనాన్ని లోకం ముందు గుర్తిస్తుంది. అంచేత వాళ్ళ పద్దెనిమిదికున్న విలువ మన మగవాళ్ళకి పాతిక్కి కూడా ఉండదు. మనం అలా నిరాశ చెందకుండా నిరీక్షించవలసిందే. అందువల్ల ఆడవాళ్ళు అదృష్టవంతులు. అట్టి అదృష్టమును

కాలదన్నింది మా సోదరి. ఆమె దారి వెంట మరో సోదరిన్నూ.

మగవారికున్న కష్టములు వేరు. దేశం మీద పడి తిని తిరిగి లోకజ్ఞానమూ, విశ్వజ్ఞానమూ అందునా సెక్సు సమాచారము తెలిసి బ్రహ్మచర్యము వహించుట బహుకష్టము. అయిననూ కష్టము నిష్టముగా మోసుకొని పోవుచున్నాము.

ఫ్రాయిడ్ చెప్పినట్టు లైంగిక భావజాలాన్ని చేతనముగానో అచేతనముగానో పొంది పొంగిపొర్లియున్నాము.

మా చిన్నవాడు తగ్గినా – నేను మా సోదరియెడల కొద్దిగా క్లోజ్‌గా మూవ్ అయ్యాను. ఈ సిటీలో అందునా 2020లో అలాకాకుండా వుండలేము. బ్రహ్మ చెముడుని కాదుగదా, మనిషిని...

మా సోదరి చెప్పలేనంటూనే చెప్పింది...

ఎంతయినా ఆడపిల్ల కదా కొంత ఏడ్చింది. ఏడ్చిందన్చెప్పి కరిగిపోకండి..

మా అమ్మ నాన్నలకి తెలుసా?

తెలీదు, తెలుసు, రెండున్నూ.

మీకు చెప్పలేనుగాని ఒకే ఇరుకు గదిలో అందరం.. వరసగా పడుకుంటాం. ఎడంగా పడుకుంటే ఇల్లు చాలదు. ఎప్పుడే చెయ్యి పడుంటే పడుండొచ్చు. నేన్చెప్పలేను కాని మా చెల్లి పేద్ద రాద్ధాంతమే చేసింది.

దేనికీ ఆఖరికి బ్రహ్మకి కూడా లొంగని సోదరి.. వంగి సలామ్ చేసేది. బెదిరిపోతోంది. ఇదే అస్త్రం... ఆయుధం.. వజ్రాయుధం...

నేనా అమ్మల పాదిని భుజానికెత్తుకున్నాను.

పెళ్ళన్నా పెళ్ళి చూపులన్నా అసహ్యించుకోవడం... యవ్వనంలో వుండాల్సిన ఊహలూ కాంతులూ లేకపోవడం... మా మిత్రులంతా మా సోదరీమణుల్ని జడపదార్థాలుగా ఆంజనేయుడుకి అప్పజెళ్ళిళ్ళుగా చెప్పుకోవడం నన్నెంతో బాధించింది. అందుమీదట నా మనసు మిక్కిలి కలత చెంది ఆమె మనసు మరల్చే ప్రయత్నం చొరవతో మరీ చేశాను. ట్రీట్‌మెంటిచ్చాను. ఏ వైద్యం చేసేవాడికయినా సెంటిమెంట్సు ఉండకూడదు. వావి వరుసలు చూడకూడదు. ఒక సైన్సుగా చూడాలి. శాస్త్రంగా చూడాలి. అంచేత నేనలానే చూశాను. ఒక తప్పుని పెద్ద తప్పుని దిద్దడానికి మరో చిన్న తప్పు చేస్తే చేయవలసి వస్తే నేనందుకు విచారించను.

అయితే చూసేవాళ్ళకి నేను సినిమాల్లో వుండే అన్నాచెల్లెళ్ళలో నేను అచ్చంగా అన్నలానే ఉంటాను, కనిపిస్తాను.

చివరకు నా ట్రీట్‌మెంటు కూడా పెద్ద సోదరికి పనికొచ్చింది. ప్లస్ పాయింటు అయింది. నేనేదో విలన్నయినట్టు నా నుండి తనని తాను కాపాడుకోవడం కోసం కరాటే నేర్చుకుందన్న విషయం నా ముందరి పైపళ్ళు నాలుగు కదిలేవరకూ నాకు తెలీదు.




దానికి ఏర్పాటు చేసిన పెళ్ళి చూపుల గొడవప్పుడు చెయ్యి విరిగిన మావయ్యకు సిమెంటు కట్టు వేశాక ఆ విషయం మరింత నిరూపితమైంది.

నేను కొంత తగ్గాను. మా తమ్ముడు నా టైపు కాదు. లోకంలోని వావివరసలూ, బంధాలూ, అనుబంధాలూ తుచ్ఛమైనవని తెలీక శాశ్వతమని నమ్ముతాడు. అందుకే మా మావయ్యతో మా పెద్ద సోదరిని కలపాలని చూశాడు. అది మా మావయ్యని లక్ష్యపెట్టదని తెలిసి – ఆడాళ్ళకి మానం, శీలం ముఖ్యమని గుర్తించి అది ఆయన చేతిలో పెట్టాలని చూశాడు. మా మావయ్యని ప్రోత్సహించాడు. ఆయన ప్రేమ పరీక్షలు రాసేందుకే క్వాలిఫై కాలేదు. ఏ క్వాలిఫికేషనూ లేనోడు ఎమ్మే ఎంట్రెన్స్ రాసి సకాలంలో పీజీ పూర్తి చేసే విధంగా వలపన్నాడు. అమ్మనీ నాన్ననీ మంచి సినిమా అని టిక్కెట్లు తెచ్చి పంపించేసి ఏకాంతం ఏర్పాటు చేశాడు. మా మావయ్య మరి ఏకాంతానికేమో ఏకంగా తలుపులు వేశాడు. తలుపులు మూస్తే పిల్లికైనా భయపడతాం, ఇది పులి... పంజా విసిరిందేమో పది రోజులు ఫేంటు వేసుకోలేదు, లుంగీతోనే ఆసుపత్రికి తిరిగాడు.. ఒక నెల రోజులు తిరిగాక 'హమ్మయ్య సంసారానికి పనికొస్తాన'న్చెప్పి పెద్ద నిటూర్పు వదిలాడు.

''ఎగైన్ అండ్ ఎగైన్...'' అంటూ సాలీడు పాఠమేం చెప్పింది?

గజనీ మహమ్మద్ దండయాత్రల చరిత్ర ఏ సత్యాన్ని నిరూపితం చేసింది?!

అదే బాటలో నేను, మేం అంతా నడుస్తున్నాం...

కష్టపడాలి.. ఫలితం భగవంతుడి వంతుకి వదిలెయ్యాలి!

ఈ కేసులో మా చీకటి.. నేపథ్యాలూ చీకటిలో ఉండిపోయాయి గనుక వీటికి సాక్ష్యం లేదు... పైగా ఇవతలి మా పార్టీకి గాక అవతలి మా సోదరీమణులకి ఉపయోగం గనుక ఇంత కంటే ఎక్కువ చెప్పకూడదు.

మా సోదరి కూడా ఆ విషయాన్ని అంతగా చెప్పదు... ఆడపిల్ల కదా?!..

మేము మగవాళ్ళమయినా మేమూ చెప్పుకోం... పంజా దెబ్బలకి సిగ్గుపడి కాదా?! అంటే కాదనీ అనం... ఔననీ అనలేం...

❀❀❀

కోడికి రెక్కలు పట్టుకోవాలి. బాతుకి మెడ పట్టుకోవాలి. మేకకి కాళ్ళు పట్టుకోవాలి. చెవుల పిల్లికి చెవులు పట్టుకోవాలి...

మరి ఆడదానికి...?

ఆడదానికి జుట్టు పట్టుకోవాలి... అని నమ్మి చెడిపోయిన వాణ్ణి నేను. నా చేతి సిమెంటు కట్టు సాక్షిగా చెపుతున్నాను, ఆడదానికి జుట్టు మాత్రం పట్టుకోకూడదు గాక పట్టుకోకూడదు. ఒక వేళ పట్టుకున్నా దాని కాళ్ళూ చేతులు కట్టేసి వుంటే ఏమో... ఏమవుతుందో నాకు తెలీదు...

పోతేపోని మనకెందుకని వదిలేద్దును..

కాని... కాని... నవత ఎవరు?

చేసుకుంటే పెళ్ళాం... వద్దులే దాంతో కాపురం కష్టం... కాకపోయినా అది నా మేనకోడలు... నాకంత కొడుకుల్లేరు గాని... లేకపోతే తీసుకొచ్చి కోడలిరకం చేయించి రాచి రంపాన పెట్టడం కాదు రంపపు పొట్టు చేసేద్దును...

అమ్మా... చెయ్యి నొప్పి...

తట్టుకోగలను, కాని నేను తట్టుకోలేనిదొకటే...

ఆడపిల్ల అడుగు గడపదాటినా నవ్వు పెదవి దాటినా చూపు చూరులు దాటినా, కళ్ళు కొండలు దాటినా – దాటి దాటి సప్తసముద్రాలు దాటి ఎక్కడకు వెళ్ళినా – ఆకాశపు అంచులు దాటినా పొద్దుబోయే సరికి... దీపం ముట్టించే సరికి... మల్లెమొగ్గలు విచ్చే సరికి మగువ ఆడపిల్ల ఇంట్లో వుండాలి!

కాని ఇదేం పిల్ల... దెయ్యం పిల్ల... ఏ పిల్లయినా కోడి (మగ) పిల్లకాదు, ఆడపిల్ల. అంచేత దాని కంటి వెలుగు చీకటింట్లో దీపం పెట్టాలి... ఈ తల్లి ఏ వీధి దీపాలు ముట్టించుకొస్తుందోగాని ఒక్కో రాత్రి ఇంటికే రాదు. అప్రదిష్ట... అప్రదిష్ట... సంసారుల ఇళ్ళలో సాని బయల్దేరింది...

'ఇవాళ ఇంటికి రావడం తప్పింది... రేపు నెల తప్పుతుంది. ఎల్లుండి ఎవడ్నో తెచ్చినా తేకపోయినా ఎత్తుకుందికి నీకు మనవడ్ని ఇస్తుంది' అని మా అక్కతో అన్నాను. ఏడుస్తుంది, ఏం కాదులే ఎంతో నమ్మకాన్ని పలుకుతుంది. అమ్మ మనసు అలాగే ఉంటుంది. కాని రేపేదన్నా జరిగితే ఫలానా సింహాచెలం మేనగోడలు అంటారేగాని ఇంకోటి అనరు. అంచేత ఆ భారం నా భుజస్కందాల మీదా నెత్తి మీదా పడింది.

దానికితోడు ముందేరెలాగెళ్తే వెనకాలేరు అలాగె

ళ్ళిందని ఆ చిన్న గుంట కూడా ఎత్తెత్తి అడుగులేస్తోంది. వదిలేస్తే అక్కని మించిపోద్ది. అంచేత ముందలేరుకి గట్లెయ్యాలి. ఉడుకు (వయసు) నీరు గట్లు కొట్టేస్తాది. ఎన్ని గట్లు తెగిపోయాయో ఎంత వరదపారి ముంచెత్తిందో ముందు చెప్పినోళ్ళ మాటలూ విన్నారు గదా... అందులో వయిసిన ఆడదానికి ఒళ్ళు మీదా పెళ్ళి మీదా శ్రద్ధ లేకపోతే మాత్రం అనుమానించాలి... ఇదేదో రాచకార్యం చేస్తోందని గుర్తించాలి.

అలా గుర్తించినందుకు నలుగురి ముందూ నా పరువు తీసింది. చెయ్యి.. అమ్మో... చెయ్యి కూడా తీసీబోయింది.

చెయ్యిపోయినా ఫరవాలేదు, ఆ మాటకొస్తే నా ప్రాణం పోయినా నేను ఖాతరు చెయ్యను. ఈ ఇంటి పరువు వీధిలో పడితే మాత్రం నేను తట్టుకోలేను. అసలు మీసమున్న మగాడెవడూ చూస్తూ ఊరుకోడు. అంచేత శాంత స్వభావుణ్నైన నేను గాంధీగార్ని నమ్మిన నేను తెరవెనుక నున్న నేను... రంగస్థలం పైకి రావల్సి వచ్చింది. కాదు కాదు మా మేనగోడలు తెచ్చింది. తీసుకొచ్చింది.

చెప్పడం మరిచాను, చెప్పాలా? మాది సాంప్రదాయమైన కుటుంబం మీకు లాగే. ఆ విషయం మీరు గ్రహించే వుంటారు.

అసలు మన ఇళ్ళల్లో ఆడపిల్లలు ఎలా వుంటారు? లక్ష్మీదేవిలా వుంటారు. పైటా పరికిణీలతో పారాడుతుంటారు. బుగ్గ చిదిమి ముద్దెట్టుకోవాలనిపిస్తుంది. మా ఆవిడ 'నీకెవర్ని చూసినా అలాగే వుంటుంద'ని అంటుంది. ఆడది కదండీ అనుమానా లెక్కువ. ఆ విషయం తర్వాతెప్పుడయినా మాట్లాడుకుందాం. అయితే మా పెద్ద మేనగోడలు పైట వెయ్యదు.. ఫాంటూ చొక్కాలు వేస్తుంది. పంజాబి డ్రెస్సులూ వేస్తుంది. పూలు పెట్టుకోదు. కాటుకా బొట్టూ సరేసరి.. ఇంక సరసానికొచ్చిందా? విరసమే... ఇంకా బయోడేటా ఇవ్వాలా పువ్వు పుట్టగానే కాదండీ మొగ్గ తొడగ్గానే నేను స్మెల్ పసిగట్టేస్తాను...

ఆ తర్వాత పోలీసులు పసిగట్టారు..

జెడ్జీలు పసిగట్టారు...

ఆ కథలన్నీ ఆలు చెప్తారు. నా కథ నేను చెప్పుకోవాలిగదా... 'ఇంతకీ సింహాచెలం నువ్వేం చేశావ్?' అని అడుగుతారా? దాన్ని నేనేమీ చెయ్యలేదు. చెయ్యడమంటే నాకు వరసవుద్దన్చెప్పి మీరు అనుమానిస్తున్నట్టున్నారు. మీ మాటలాగే వుంది. బాగుంది, మీరే కాదు, ఎవ్వులైనా అలాగే అంటారు. కాని మా మేనకోడలు ఇకటమాడవెళ్తే ఇరుముడి కట్టేసి పంపించేస్తాది. ఆ తర్వాత మనకి స్వామియే శరణమయ్యప్పే... కొండెక్కిపోవాలి... అందుకే అతగాడు ఆడోళ్ళని కొండ దిగవనే కాదు, ఏకంగా మగవాళ్ళకి దూరంగా వుంచీసేడు.

మనకి భగవంతుడంత ముందు చూపులేదు. మనిషన్నోడికి వెనకచూపు వుండాలి, వుంటుంది. అంటేటన్నమాటా? ఒక దఫా దెబ్బ తినిస్తే ఇంకో దెబ్బ తినకుండా వెనకాతల వెళ్ళైనా దెబ్బ తీసియ్యాల... దాన్నే వెనకచూపు అన్నానన్నమాట.

మరి నేనూ చూపు చూడకుండా దెబ్బతియ్యకుండా వుంటానా? ఇప్పుడు పోలీసులే మన వెనకాతలున్నాక జడ్జీగారే మన ముందున్నాక దాపుడెందుకు? అలాటాడదానికి ఎలాగ దెబ్బతీశామో తెలిస్తే మీ మనసూ సంతోషిస్తాది... అందుకని మీకు తెలియని కథ... మళ్ళీ ఆ ఆడపిల్ల తేరుకోలేని కథ చెప్తాను.

నా చెయ్యి విరిస్సిందని కాదుగాని, దానికి కరాటే నేర్పిన లంజకొడుకుని తన్నాల. తంతే ఆడు మళ్ళీ మనల్ని తంతాడు. అంచేత అలాగ తన్నకూడదు. ముడ్డిమీద తంతే ముఖం వాచిపోవాలన్నమాట...

అందుకే...

అందుకే మరి ఆ కరాటే మేష్టుగోర్ని మేష్టుగోరుగానే వుంచి పక్కన మానవతని అమ్మగార్ని చేస్సామన్న మాట. అంటే ఇంకా అర్థం కాలేదాండీ... కరక్టు... ఆలుమగల్ని చేస్సామని అర్థమయ్యింది కదా...

చేసిస్తే అయిపోడానికిది పెద్దలు కుదర్చిన పెళ్ళికాదు. ప్రేమించుకున్న పడుచుల పెళ్ళీ కాదు. ఇది పుకార్ల పెళ్ళి. ఆ మాటకొస్తే పెద్దల పెళ్ళికి... ప్రేమల పెళ్ళికి పది మంది కాపోతే వంద మంది అక్షింతలు వేస్తారు. ఈ పుకార్ల పెళ్ళికి రాకుండానే ఉన్నచోటే నిలబడి ఊరంతా ఉళాలు పోసి మరి అక్షింతలు వేసింది. ఆ విధంగా మీరూ అక్షింతలు వేసే వుంటారు, మీకు థాంక్స్...

అయితే కథ కంచికి వెళ్ళకపోయినా కుర్రాడు వాళ్ళ ఊరు కలకత్తాకి పోయాడో లేదో తెలీదుగాని




విషయం తెలుసుకున్న మా కోడలు.. అది కాదన్నా వద్దన్నా నాకు కోడలే.. అయితే నా కోడలు కరాటే కాంపౌండువాలు కేసైనా వెళ్ళడం మానుకుంది. కాని దాని గుణం మానుకోలేదు. ఇలాటి దాన్ని చూసే సామెత చెప్పారు. చెప్పిన ప్రకారమే మాణిక్యమొంటి మనవు మానుకుంది గాని గుణం మానుకోలే..

మానుకోపోతే పోయింది, అక్కడితో ఆగక పిల్లలకి కరాటే స్కూలు పెట్టింది. కత్తి సాముకి కుర్రాళ్ళను పంపినట్టు పిల్లల్ని తలిదండ్రులు తమకి తాము రాజులనుకున్నారేటో కత్తి సాముకి సారి కరాటే క్లాసులకి పిల్లల్ని పంపారు.

అప్పుడు ఐడియా పోలీసు వారిచ్చారు, పుణ్యాత్ములు... పాపం పూరా పండిపోదటండీ.. అందుకే అమ్మాయి నక్సలైట'ని ఇంటింటికీ జన్మభూమి ప్రచారం చేసినట్టు ప్రచారం చేశారు. బ్రహ్మంగారు బోధించినట్టు... మీ పిల్లలకి కరాటే వచ్చినా రాకపోయినా కాల్చీడమొస్తాది... తుపాకీలు పట్టుకొని పిట్టల్ని కాల్చినట్టు కాల్చేసుకుంటారు.. మీ పిల్లలకి మీరే తలకొరివి పెట్టేద్దురని... మంచి స్క్రిప్ట్ వర్క్ చేసార్లే... డైలాగ్స్ ఆలకి చెప్పాల...?

ఏమైనా మొదటే చెప్పాను కదా... పెళ్ళి మీదా ఒళ్ళు మీదా ధ్యాసలేని ఆడదాని రాచకార్యాలు ఏపాటివో.. ఎంత గాముండాలో మీకూ బోధపడి వుంటాది.

అన్నట్టుగా చెప్పడం మర్చిపోయాను... ముందు నుండీ చేస్తున్న పార్ట్‌టైము ప్రైవేటుద్యోగం ఫుల్‌టైముకి మారింది మా కోడలు. అక్కడా ఈ నక్సలైటు జన్మభూమి ప్రచారమే... దాంతోటి ఆ మేనేజరెవడో గాని పిత్తబోయి చిరుక్కుంటాడట. అంచేత మరి ప్రచారం పని పెట్టలే... డిస్మిస్ ఆర్డర్స్ కిస్మిస్ పళ్ళిచ్చినట్టు పళ్ళికిలిస్తూ ఇచ్చేశాడట. అయినా ఎవరికి మాత్రం నరుకోత నక్సలైట్లంటే భయముండదండీ...

మా చిన్న కోడలు 'అక్క అలాటిదాయి కాదూ' అంటాది, ఇదీ అదే బడి చదివింది మరి అదే పాఠం చదవదా? అప్పుజెప్పదా?!

మొత్తానికి కరాటే స్కూలూ మూతబడిపోయింది. ఉద్యోగమూ వూడిపోయింది. సగం చచ్చిన పాముని వదిలెయ్యకూడదు. ఆ మాట పోలీసులకీ తెలుసు. జడ్జీ గారికి అంతకన్నా తెలుసు. వాళ్ళే చూసుకుంటారు, చూసుకున్నారు.

ఏం చూశారంటారా?

చూసిన వాళ్ళనే అడగండి...

అడక్కపోయినా చెపుతారు... మీ పిల్లలా చెడిపోకూడదు కదా... మీకు తెలియకపోతే మీ పిల్లలలానే చెడిపోతే మళ్ళీ బాధ్యతెవరికి? డ్యూటీ ఎవరికి...? పోలీసులకీ, లాయర్లకీ, జడ్జీలకీ కదా? అంచేత ఆల జట్టీలేవో ఆల నోటితోనే వినండి... శలవ్... మీ సింహాచెలం.

(ఇంకావుంది)